క్లుప్తంగా

శ్రీమఠానికి వెండి బిందె విరాళం



బిందెను స్వీకరిస్తున్న మేనేజర్ శ్రీనివాసరావు

మంత్రాలయం : కర్ణాటకలోని గుల్బర్గాకు చెందిన రాఘవేంద్ర పాండ్యా అనే భక్తుడు శ్రీమఠానికి విరాళం అందజేశారు. శనివారం శ్రీమఠం మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావుకు 531 గ్రాముల వెండితో రూ.44,410 విలువ జేసే అష్టలక్ష్మి ప్రతిమలతో తయారు చేసిన చిన్న బిందెను మొక్కుబడిలో భాగంగా అందజేశారు. ఈ సందర్భంగా దాతలకు మేనేజర్ స్వామి వారి శేషవస్త్రం, ఫల,పూల మంత్రాక్షింతలు అందజేశారు.

ఉరుకుంద రోడ్డు పనులు ప్రారంభం



జేసీబీతో రోడ్డును తవ్వుతున్న దృశ్యం

కౌతాళం: మండలంలోని ఏరిగేరి–ఉరుకుంద గ్రామాల రోడ్డు పనులకు శనివారం శ్రీకారం చుట్టినట్లు ఆర్అండ్బీ ఏఈ సాయిసురేష్ తెలిపారు. ఏరిగేరి నుంచి ఉరుకుంద వరకు 9 కి.మీ. మేర రోడ్డు వేసేందుకు రూ. 4కోట్లు మంజూరవడంతో కాంట్రాక్టర్ పనులు ప్రారంభిచారని చెప్పారు. పనులను వీలైనంత త్వరగా పూర్తి చేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా చేపడుతామన్నారు. పనుల్లో నాణ్యత లోపించరాదని సూచించారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

కౌతాళం: మండలలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో స్వామి వారికి శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి దర్శించుకున్నారు. మండల కేంద్రంతో పాటు అగసలదిన్నె గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి, సుళేకేరి గ్రామ శివారులో వెలసిన బుడుములదొడ్డి ఆంజనేయస్వామి దేవాలయం, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజనేయస్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా తెల్లవారుజామున అర్చకులు స్వామికి సుప్రభాతసేవ, మహామంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకం వంటి విశేష పూజలను జరిపించారు. భక్తుల రాకతో ఆయా ఆలయాల ప్రాంగణాలు కిటకిటలాడాయి.

లో ఓల్టేజీ సమస్యకు పరిష్కారం



ట్రాన్స్ఫార్మర్ను ప్రారంభిస్తున్న ట్రాన్స్కో అధికారులు, వైఎస్సార్సీపీ నాయకులు

మంత్రాలయం : స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమీపంలోని కాలనీలో 8 ఏళ్లుగా లో ఓల్టేజీ సమస్య వేధిస్తోంది. లో ఓల్టేజీ కారణంగా విద్యుత్ పరికరాలు మరమ్మతులకు గురవుతుండటంతో స్థానికులు ఇబ్బందులు పడుతూ వచ్చారు. సమస్య తెలుసుకున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు రూ. 3 లక్షలు వెచ్చించి 100 కేవీ ట్రాన్స్ఫార్మర్ను విద్యుత్ శాఖ అధికారులు ఏర్పాటు చేశారు. శనివారం ట్రాన్స్ఫార్మర్ను వైఎస్సార్ సీపీ నాయకులు జనార్దన్రెడ్డి, వీరేష్స్వామి, ప్రహ్లాదాచారి, రంగారెడ్డి ప్రారంభించారు.

రుద్రభూమి, బావి స్థలాలను కాపాడండి

ఆదోనిఅర్బన్: ఆదోని డివిజన్ పరిధిలోని గోనెగండ్లంలో అన్యాక్రాంతమైన రుద్రభూమి, బావి రస్తా స్థలాలను కాపాడాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు బసవన్నగౌడ్, హిందూ శ్మశాన వాటిక పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజుగౌడ్ కోరారు. శనివారం స్థానిక విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గోనెగండ్ల గ్రామంలోని రస్తా సర్వే నంబర్ 223/బీలో 0.72 విస్తీర్ణం, 227లో 0.80 విస్తీర్ణం, రుద్రభూమి సర్వే నంబర్ 226లో 1.60, బావి సర్వేనంబర్ 228లో 0.47 విస్తీర్ణం ఇతరులు ఆక్రమించి, పురాతన కట్టడాలను చెరిపివేసి అక్రమ నిర్మాణాలను చేపట్టినప్పటికీ అధికారులు పట్టనట్లు వ్యవహరించడం సరికాదన్నారు. వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. భజరంగ్దళ్ జిల్లా సహ ప్రముఖ మహేష్, గోరక్ష ప్రముఖ శంకర్, రంగస్వామి పాల్గొన్నారు.

జగనన్న కాలనీలకు విద్యుత్ కాంతులు

- డివిజన్లోని 354 లేఅవుట్లలో జోరుగా విద్యుద్దీకరణ పనులు
- రూ.10.58 కోట్లతో 510 ట్రాన్స్ఫార్మర్లు, 6,100 విద్యుత్ స్తంభాలు, 351 విద్యుత్ లైన్ల ఏర్పాటు
- ఒక కాలనీలో విద్యుత్ పోయినా మరో కాలనీ నుంచి తీసుకునేలా పనులు
- ప్రతి కాలనీకి 160 కేవీ మినీ ట్రాన్స్ఫార్మర్లు
- చివరి దశలో పనులు
- ఆదోని సమీప లేఅవుట్లో రూ.2.50 కోట్లతో 33/11కేవీ సబ్స్టేషన్ నిర్మాణం



మండగిరి కాలనీలో జగనన్న ఇళ్ల నిర్మాణాలు



మినీ ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేసిన దృశ్యం

ఆదోనిసెంట్రల్: పేదవాడి సొంతింటి కలను సాకారం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలతో పాటు మౌలిక సదుపాయాల కల్పన పనులు ముమ్మరం చేసింది. ఆదోని డివిజన్ పరిధిలోని 354 లే అవుట్లలో విద్యుద్దీకరణ పనులు జోరగా సాగుతున్నాయి. రూ.10.58 కోట్లతో 510 ట్రాన్స్ఫార్మర్లు, 6100 స్తంభాలు, 351 విద్యుత్తు లైన్లను ఏర్పాటు చేశారు. పట్టణ సమీపంలోని జగనన్న కాలనీల్లో 9,327 ప్లాట్లను లబ్ధిదారులకు అందజేశారు. మొదటి విడతగా 5,101 ఇళ్ల నిర్మాణ పనులను థర్డ్ పార్టీ వారు చేస్తున్నారు. రూ.2 కోట్లతో విద్యుత్ ట్రాన్స్ఫార్మర్లు, స్తంభాలు, లెస్ట్ అఫ్ లైన్ విద్యుత్ వైర్లు, ఏబీ స్విచ్లు, కాసారాలు ఇతర సామగ్రి వంటి పనులను చేపట్టారు. ఒక కాలనీలో విద్యుత్ సరఫరా పోయినా మరో కాలనీ నుంచి విద్యుత్ తీసుకునేలా 160 కేవీ మినీ ట్రాన్స్ఫార్మర్లను ఏర్పాటు చేశారు. ఇప్పటికే విద్యుత్ లైన్ల నుంచి విద్యుత్ సరఫరా కొనసాగడంతో ఇటుకలను అక్కడే తయారు చేస్తుండటంతో వాటితో ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు.

రూ.2.50 కోట్లతో 33/11 కేవీ సబ్స్టేషన్..

జగనన్న కాలనీల్లో వందల సంఖ్యలో ఇళ్ల నిర్మాణాలను చేపడుతున్నారు. పేద, మధ్య తరగతి వారు నివసించే ప్రాంతంలో ప్రజలు ఇబ్బందులకు గురి కాకుడదని ప్రభుత్వం తాగునీరు, అంతర్గత రహదారులతో పాటు విద్యుద్దీకరణ పనులను చేపట్టింది. అందులో భాగంగా కాలనీ సమీపంలో రూ.2.50 కోట్లతో 33/11 కేవీ సబ్స్టేషన్ ఏర్పాటు చేసింది. ఈ సబ్స్టేషన్ ద్వారా కాలనీలో విద్యుత్ సమస్య తలెత్తకుండా అన్ని జాగ్రతలు తీసుకొని పనులను పూర్తి చేశారు. ఇప్పటికే కాలనీలో విద్యుత్ స్తంభాలతో పాటు విద్యుతీగలు, మినీ ట్రాన్స్ఫార్మర్లను ఏర్పాటు చేశారు. 160 కేవీ మినీ ట్రాన్స్ఫార్మర్ను అమర్చి విద్యుత్ సమస్య తలెత్తకుండా ఉండేలా పనులను చేపట్టారు. మినీ సబ్ స్టేషన్ ద్వారా ఆదోని పట్టణానికి సమీప గ్రామాలు ధణాపురం, నాగనాథనహళ్లి, సాదాపురం, మండగిరి, బసాపురం వంటి గ్రామాలకు విద్యుత్ సరఫరా అందేలా చర్యలు చేపట్టారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తయితే లబ్ధిదారులు ఇళ్లను స్వాధీనం చేసుకునే ముందు వీధి దీపాలను కూడా అమర్చనున్నారు. కాలనీల్లో అన్ని వసతులు సమకూర్చేలా ప్రణాళికబద్ధంగా పనులు చేస్తున్నారు.



ఆదోని లేఅవుట్లో ఏర్పాటు చేసిన మినీ సబ్స్టేషన్

పనులన్నీ పూర్తి చేశాం

జగనన్న కాలనీల్లో విద్యుద్దీకరణ పనులను దాదపుగా పూర్తి చేశాం. అక్కడక్కడ చిన్నచిన్న పనులు ఉన్నాయి. అవి కూడా త్వరలో పూర్తి చేస్తాం. లబ్ధిదారులు తమ ఇళ్లను స్వాధీనం చేసుకొనే ముందు వీధి దీపాలను కూడా ఏర్పాటు చేస్తాం. కాలనీల్లో మినీ ట్రాన్స్ఫార్మర్లను ఏర్పాటు చేయడం వల్ల భవిష్యత్లో విద్యుత్ సమస్య తలెత్తినా పక్క కాలనీల నుంచి విద్యుత్ తీసుకొలా ప్రణాళిక బద్ధంగా పనులు పూర్తి చేశాం. – **యల్లప్ప, విద్యుత్ శాఖ ఏడీ**

బీమా తక్షణ సాయం అందజేత

కౌతాళం: మండలంలోని కరణి గ్రామంలో మృతి చెందిన పూజారి వీరేష్ కుటుంబానికి ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి సొంతంగా రూ.పది వేలతో పాటు వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.పది వేలు అందించినట్లు సర్పంచ్ పుష్పలత, గ్రామ ఇన్చార్జ్ గోవిందు తెలిపారు. వీరేష్ మృతి విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే ఆర్థిక సాయం అందజేయాలని ఆదేశించారని, అలాగే వైఎస్సార్ బీమా వర్తించడంతో అందులోని తక్షణ సాయం సొమ్మును కూడా శనివారం మృతుడి భార్య ఆంజినమ్మకు అందజేశారు.

ఘనంగా షేక్ బిరద్దీన్ దాదా ఉరుసు



ప్రత్యేక అలంకరణలో షేక్ బిరదీన్ దాదా సమాధి

హొళగుంద: మండల పరిధిలోని కొత్తపేట గ్రామ సమీపంలో వెలిసిన షేక్ బిరద్దీన్ దాదా ఉరుసు ఉత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. ఉత్సవాలను తిలకించడానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చి తాత సమాధిని దర్శించుకున్నారు. తెల్లవారుజామున గంధం ఊరేగింపుగా దర్గాకు చేరడంతో భక్తులు ఫాతెహాలు చేశారు. ఆదివారం జియారత్తో వేడుకలు ముగియనున్నాయి.

అప్రమత్తంగా ఉండాలి



బాణసంచా దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తున్న డీఎస్పీ శివనారాయణస్వామి

ఆదోనిఅర్బన్: బాణసంచా దుకాణాల్లో నిబంధనలను పాటించాలని, ప్రజలు బాణాలు కాల్చేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకొని అప్రమత్తంగా ఉండాలని డీఎస్పీ శివనారాయణస్వామి తెలిపారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ క్రీడా మైదానంలో దీపావళి పండగ సందర్భంగా 10 బాణసంచా దుకాణాలను ఏర్పాటు చేయగా వాటిలో డీఎస్పీ తనిఖీలు నిర్వహించారు. దుకాణాల్లో నిబంధనల ప్రకారం ఎలాంటి అగ్ని ప్రమాదం జరగకుండా ఏర్పాట్లు చేసుకోవాలని చెప్పారు. ముందుగా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలుపుతూ క్రాకర్స్ కాల్చేటప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వివరించారు. దుకాణదారులు ఎక్కువ ధరలకు అమ్మకూడదని సూచించారు. పైకి ఎగిరే బాణాలు క్రీడా మైదానంలో మాత్రమే కాల్చాలన్నారు. టూటౌన్ సీఐ శ్రీనివాసనాయక్, సిబ్బంది ఉన్నారు.

జగనన్నను మళ్లీ సీఎంగా గెలిపించుకుందాం



మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న సచివాలయ కన్వీనర్లు

కోసిగి: పేద బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం అమలవుతున్న సంక్షేమ పథకాలు, రాష్ట్రాభివృద్ధి కొనసాగాలంటే వైఎస్ జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా మరోసారి గెలిపించుకుందామని కోసిగి సచివాలయం-1 కన్వీనర్లు బుళ్లి నరసింహులు, ప్రవీణ్ కుమార్ కోరారు. శనివారం స్థానిక సచివాలయం-1,2 పరిధిలో కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం చేపట్టారు. వారు ఇంటింటికీ వెళ్లి గత ప్రభుత్వ పాలన తీరు, పథకాల అమలును ప్రస్తుతం జగనన్న పాలన, అమలు చేస్తున్న పథకాలు, అభివృద్ధి గురించి పోల్చి వివరించి తేడాలను తెలియజేశారు. అనంతరం ప్రజలకు పథకాల అమలు, అభివృద్ధిని వివరించే బ్రోచర్లను అందజేశారు. గోపాల్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఘనంగా మౌలానా అబుల్ కలాం జయంతి





కౌతాళంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఆదోనిలో ఆజాద్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

కౌతాళం: దేశంలో విద్యాభివృద్ధికి మౌలానా అబుల్ కలాం ఆజాద్తోనే చేసిన కృషి చేశారని తహసీల్దారు రామేశ్వర్రెడ్డి గుర్తు చేశారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని శనివారం మండల కేంద్రంలో నిర్వహించారు. ప్రతిభ హైస్కూల్ నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొని ఆయ న సేవలను కొనియాడారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులు గ్రామంలో చేపట్టిని ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం పాఠశాలలో వివిధ సాంస్కృతి కార్యక్రమాలు చేపట్టారు. మండల సర్వేయర్ బసవరాజు, హెచ్ఎం జ్ఞానేశ్వరి, కార్యదర్శి మైనుద్దీన్ పాల్గొన్నారు.

ఆదోనిరూరల్: దేశ మొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం పలువురు నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ దేవిశెట్టిప్రకాష్, జిల్లా మైనార్టీ చైర్మన్ ఎండీ నూర్ మాట్లాడుతూ ఆజాద్ దేశ స్వాతంత్య్రం కోసం గాంధీజీ, నెహ్రూతో కలిసి ఎన్నో ఉద్యమాల్లో పాల్గొన్నారని గుర్తు చేశారు. ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి బి.తాయన్న, ఎస్సీ సెల్ మండల ప్రెసిడెంట్ నెట్టికల్ హనుమంతు, టౌన్ మైనార్టీ ఉపాధ్యక్షుడు హుసేన్బాషా, జిల్లా మైనార్టీ కార్యదర్శి బేగ్, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఖలందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కౌతాళంకు ప్రముఖులు రాక



ప్రారంభానికి సిద్ధంగానున్న మజ్జీదె-ఎ-ఖాదిర్

కౌతాళం: మండల కేంద్రంలో మతసామరస్యానికి ప్రతీకగా వెలసిన జగద్గురు ఖాదర్లింగ స్వామి దర్గా ఆవరణలో నిర్మించిన మజ్జీదె-ఎ-ఖాదర్ను ఆదివారం పలువురు ప్రముఖులు ప్రారంభించనున్నారు. ఇందుకు దేశం నలుమూలల నుంచి వివిధ దర్గాల పీఠాదిపతులతో పాటు ప్రముఖ రాజకీయ నాయకులు హాజరుకానున్నారని దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా ఉశేని చిష్టీ శనివారం తెలిపారు. రాష్ట్రం తరపున డిప్యూటీ సీఎం అంజాద్బాషా, కర్ణాటక రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ యు.టీ. ఖాదర్ సాబ్తో పాటు కర్నూల్ ఎమ్మెల్యే ఆఫీజ్ఖాన్, మంత్రాలయం, ఆదోని ఎమ్మెల్యేలు బాలనాగిరెడ్డి, సాయిప్రసాద్రెడ్డి హాజరు అవుతారని తెలిపారు. అలాగే.. అజ్మీర్ ఖాజాగరీబ్ నవాజ్ దర్గా ప్రధాన పీఠాధిపతి సయ్యద్ నసురుద్దీన్ చిష్టీ, గుల్బార్గ్ బందెనవాజ్ దర్గా పీఠాధిపతి సయ్యద్ గౌసుధరజ్ ఖుస్రు హుసేని చిష్టీ, బీదర్లోని అబుల్ ఫయ్యాజ్ దర్గా పీఠాధిపతి సయ్యద్ షా అసదుల్లా హుసేనితో పాటు వివిధ దర్గాల పీఠాధిపతులు హాజరుకానున్నారని పేర్కొన్నారు. మజ్జీద్ను సాయంత్రం 4.30 గంటలకు ప్రారంభిస్తామని, ఇందులో మొదటిసారిగా 4.45 'అసర్' నమాజ్ చేస్తామన్నారు. దర్గా ఉత్తర భాగాన నిర్మించిన ఉత్తర ద్వారంను కూడా ఈ సందర్భంగా ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు.

దొంగల ముఠా అరెస్టు



దొంగల ముఠాల నుంచి రికవరీ చేసిన వాహనాలు, వైర్లు, నగలు, నగదు వివరాలను వెల్లడిస్తున్న సీఐ

కర్నూలు : జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో గొర్రెలు, కరెంటు తీగలు, ఇళ్లలో దొంగతనాలకు పాల్పడిన దొంగల ముఠాలను తాలూకా పోలీసులు అరెస్టు చేసి కటకటాలకు పంపారు. పక్కా సమాచారం మేరకు గుంతకల్లుకు చెందిన రాఘవయ్య, కర్నూలు మమతా నగర్కు చెందిన ఎరుకలి సురేష్, డోన్ మండలం కొత్తబురుజు గ్రామానికి చెందిన రంగనాయకులు, కర్నూలు ప్రకాష్నగర్కు చెందిన బోయ విజయ్, నరసింహారెడ్డి నగర్కు చెందిన ఎరుకలి మధు, అశోక్ నగర్కు చెందిన పేరపోగు రాకేష్, దేవనకొండకు చెందిన ఎరుకలి సురేష్, సుధాకర్, డాన్ శ్రీను, కడప రామయ్య తదితరులను అదుపులోకి తీసుకుని విచారించగా వారి నేరాల చిట్టా బయటపడింది. కర్నూలు మండలం రుద్రవరం గ్రామ పొలిమేరలోని కొండ వద్ద గొర్రెల దొంగతనం, అలాగే కర్నూలు బాలాజీ నగర్, వెంగన్నబావి సమీపంలోని బాలాజీ విల్లాస్లోని ఓ ఇంట్లో దొంగతనాలకు పాల్పడినట్లు అంగీకరించారు. అలాగే జి.శింగవరం గ్రామంలో మోటర్ సైకిల్, నిడ్జూరు, ఉలిందకొండ, సూదేపల్లి, బ్రాహ్మణదొడ్డి, సంగాల, కడప జిల్లా ముద్దనూరు మండలం చెన్నంపల్లి గ్రామాల్లో మొత్తం 111 గొర్రెలు దొంగతనం చేసినట్లు అంగీకరించారు. వారి నుంచి రూ.21 లక్షలు విలువ చేసే గొర్రెలు, మోటర్ సైకిళ్లు, బంగారు, వెండి ఆభరణాలు, బొలెరో వాహనాన్ని స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు సీఐ శ్రీరాం తెలిపారు. అలాగే కర్నూలు మండలం బి.తాండ్రపాడు గ్రామం వద్ద ఎన్హెచ్-44 నుంచి నంద్యాలకు వెళ్లే హైవే రింగ్ రోడ్డు మధ్యలో గల టిడ్కో ఇళ్లల్లో కరెంటు వైర్లు దొంగతనం చేసిన మరో 16 మంది ముఠా సభ్యులు నంద్యాల జిల్లాకు చెందిన పశువుల శ్రీకాంత్, నరసింహుడు, బోయ శ్రీనివాసులు, మధుబాబు, బాలకొండయ్య, పసుపుల నాగేంద్ర, పుల్లయ్య, ఎర్రపాపన్న, పోలూరు మల్లికార్జున, షేక్ ఫరూక్ బాషా, నాగశేషులు, ప్రసన్న కుమార్, చింతమాను నాగరాజు, బోయ పెద్ద ఎల్లయ్య, వడ్డె మదనగోపాల్, షేక్ బాబా హుసేన్ తదితరులను అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారు. వారి నుంచి రూ.19,61,517 విలువ చేసే 315 కరెంటు వైర్ బండిల్స్, నేరానికి ఉపయోగించిన తుఫాన్ వాహనం, రెండు మోటర్సైకిళ్లను సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. రెండు ముఠాల నుంచి రూ.61,61,517 విలువ చేసే సొమ్ములు, వాహనాలు, గొర్రెలను రికవరీ చేసినట్లు సీఐ శ్రీరాం తెలిపారు.

ఫ్యామిలీ ఫిజీషియన్తో ఇంటి వద్దకే వైద్యం

ఆలూరు రూరల్: ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ద్వారా రోగుల ఇంటి వద్దకే వైద్య సేవలు అందిస్తున్నట్లు మొలగవల్లి పీహెచ్సీ డాక్టర్ శాంతి అన్నారు. శనివారం ఆమె ఆలూరులోని సచివాలయం-2 లో ఇంటి వైద్య కార్యక్రమంలో భాగంగా రోగులకు వైద్య పరీక్షలు చేసినట్లు చెప్పారు. 118 మంది వృద్ధులు, గర్భిణులకు బీపీ, షుగర్ వంటి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, ఆరోగ్యశ్రీ కింద ఆపరేషన్ చేయించుకున్న రోగులకు ఏఎన్ఎంలు ఇంటింటికి వెళ్లి రోజు వైద్య పరీక్షలు చేసి ప్రత్యేక యాప్లో వారి వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఏఎన్ఎంలు, 104 సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

జయప్రదం చేయండి



సమావేశం నిర్వహించిన సీఐటీయూ నాయకులు

ఆదోనిరూరల్: జీవో నంబర్ 21ను రద్దు చేయాలని ఆటో కార్మికుల సమస్యలు పరిష్కారానికి ఈనెల 15వ తేదీన జరిగే ఛలో విజయవాడ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ఆటో కార్మికులు పాల్గొనాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.ఎస్.రాధాకృష్ణ పిలుపునిచ్చారు. శనివారం ఏపీ ఆటో అండ్ ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా కమిటీ సమావేశాన్ని పట్టణంలోని సుందరయ్య భవన్లో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జీవో నంబర్ 21 వల్ల అధిక ఫెనాల్టీలు కట్టాల్సి వస్తుందని, పైగా ట్రాఫిక్ అధికారులు నిర్దాక్షిణ్యంగా ఆటోలను సీజ్ చేస్తూ వేలాది రూపాయల జరిమానా వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వీటి వల్ల డ్రైవర్ల పరిస్థితి అగమ్యగోచరంగా మారిందన్నారు. సీఐటీయూ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు తిప్పన్న, గోపాల్, నాయకులు ప్రభాకర్, వెంకటేశ్వరరెడ్డి, హనుమంతు, రాధాకృష్ణ, గోవిందు, రాజు, కృష్ణ, మనోహర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విరబూసిన కొలను!

అదో చిన్న పాటి నీటి కుంట.. ఆ కుంట నిండా కలువ పువ్వుల్లా విరబూసిన పూలు ఇవి.. చూడగానే ఇట్టే మనసును ఆకట్టుకుంటోంది. మంత్రాలయం మండలం తుంగభద్ర–రాంపురం రోడ్డు మార్గం ఆనుకుని ఉన్న ఈ కొలనులోని నీటిజాతి పుష్పాలు చూపరులను కనువిందు చేస్తున్నాయి.

– మంత్రాలయం



రాంపురం–తుంగభద్ర రోడ్డు పక్కన కుంటలో పూసిన పూలు